

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

### ఎపుడో ఏకాంతంలో...

**నిరంజన్** తన ఎదురుగా కూర్చున్న విద్యార్థుల వంక చూసాడు. ఉత్సాహం వెల్లివిరిసే వాళ్ళలో తెలివి, ఆత్మవిశ్వాసం ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆడిటోరియం కళకళలాడుతోంది. అనేక రాష్ట్రాలనించి వచ్చిన విద్యార్థులు చదువు ముగించుకుని ఆవకాశాలు వెదుక్కుంటూ బయటి ప్రపంచంలోకి వెళ్ళడానికి సంసిద్ధంగా ఉన్నారు.

స్టేజ్ మీదున్న కన్వీనర్ ముఖ్య అతిథి నిరంజన్ గురించి, అతని వ్యాపార విజయాల గురించి క్లుప్తంగా చెప్పి అతన్ని మాట్లాడాల్సిందిగా కోరాడు.

లేచి నిలబడి టేబుల్ మీదున్న కార్డ్‌లెస్ మైక్ అందుకుంటూ నిరంజన్ ఆ విద్యార్థుల వంక మరోసారి చూసాడు. నిజానికి తను చెప్పాల్సిన టిప్స్‌కాని, బోధలు కాని ఏవీ లేవని, ఈ జనరేషన్ పిల్లలు తనకంటే చాలా తెలివిగలవాళ్ళని, అవకాశాలు అంది పుచ్చుకోవడంలో నేర్పరులని అతనికి అనిపించింది. కానీ ముఖ్యఅతిథిగా తన ఉపన్యాసం కోసం వాళ్ళు ఎదురుచూస్తున్నారు కాబట్టి మాట్లాడక తప్పదు.

తర్వాతి నలభై ఐదునిమిషాలు నిరంజన్ వారికి విసుగుపుట్టని విధంగా తనలో చిన్నప్పటినించి ఉన్న వ్యాపార ఆసక్తి గురించి తన ఎదుగుదల క్రమం గురించి ఆసక్తిగా వివరించాడు. ఇరవైయవ ఏట ఎకనామిక్ టైమ్స్ ఎడిటర్ జైదీప్ బోస్‌ని ఇంప్రెస్ చేసి అనలిస్ట్‌గా చేరిన మొదటి ఉద్యోగం గురించి చెప్పాడు. ఇరవై రెండో ఏట ఆదిత్య బిర్లాని కలిసిన సందర్భం, చిన్న కుర్రాడని చూడకుండా తనకి అపాయింట్‌మెంట్ ఇచ్చిన ఆయన ఔదార్యం గురించి చెప్పాడు.

ఆ తర్వాత చిన్న పరిశ్రమని స్థాపించి మల్టీనేషనల్ కంపెనీగా దాన్ని ఎలా అభివృద్ధి చేసాడో చెప్పాడు.

"నా జీవితంలో వృధా అయిన కాలం నామినేటెడ్ సభ్యుడిగా రాజ్యసభలో గడిపిన ఆరేళ్ళ కాలం. సో మీరు రాజకీయాలకి ఎంత దూరంగా ఉంటే అంత మంచిది" నవ్వుతూ చెప్పి ముగించాడు.

తర్వాత మిగిలిన అతిథుల ప్రసంగాలు, విద్యార్థులకి డిగ్రీ ప్రదానంలాంటి కార్యక్రమాలు ముగిసేసరికి రాత్రి తొమ్మిదిన్నరైంది. ఆహ్వాన సంఘం చెప్పిన సమయంకన్నా అరగంట ఆలస్యమైంది.

బయటకి వచ్చి డ్రైవర్‌కి ఫోన్ చేసాడు. తర్వాత అతను చెప్పినవైపు నెమ్మదిగా నడవసాగాడు. విద్యార్థులంతా గుంపులు గుంపులుగా కబుర్లు చెప్పుకుంటూ, ఫోటోలు తీసుకుంటూ గేట్ వైపు నడుస్తున్నారు.

"ఇంత సాధించాడు. ఏం లాభం? బ్రహ్మచారిట." ఓ అమ్మాయి తన పక్కన నడిచే మరో అమ్మాయితో తెలుగులో చెప్పింది.

అది తన గురించేనని నిరంజన్‌కి అర్థమైంది.

"జీవితంలో ఏదైనా సాధించాలనే గోల్ ఉన్నవాళ్ళు అంతే. పెళ్ళి, పిల్లలులాంటి జంఝాటాలు పెట్టుకుంటే ఈ అఛీవ్‌మెంట్ ఉండదు" పక్కనున్న అమ్మాయి చెప్పింది.

"సినిమాలు, పేకాటలాగానే 'ఇంకా' అనేది ఓ వ్యసనం. ఇంకా సాధించాలి, ఇంకా పొందాలి, ఇంకా డబ్బు సంపాదించాలి.. ఇలా. ఈ 'ఇంకా'కి అంతం వుండదు. జీవితపు చివరి అంచుకి చేరుకున్నాక తన సంపదకాని, తన పేరు కాని తనతో స్నేహం చేయవని, అది మరోమనిషి వల్లే సాధ్యం అని తెలుసుకుంటారు. కానీ అప్పటికి ఆలస్యమైపోతుంది." మొదటి అమ్మాయి భారంగా చెప్పింది.

"బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ చదివిన అమ్మాయిగా నువ్వు తృప్తి గురించి మాట్లాడకూడదు. ఒకసారి తృప్తి పడితే ఇక ఎదుగుదల ఉండదు" రెండో అమ్మాయి చెప్పింది.

"నిజమే. నేను తృప్తి పడమనడంలేదు. వ్యాపార రంగంలోనేకాదు, వ్యక్తిగత జీవితంలో కూడా ఒక గోల్ ఉండాలి. ఊహూ. రెండు గోల్స్. ఒకటి నా భాగస్వామిని ప్రేమగా, అపురూపంగా చూసుకోవాలి అనే గోల్. రెండోది నా పిల్లల్ని చక్కగా పెంచాలి, వాళ్ళకి అవసరమైన సమయం కేటాయించి మంచి పౌరులుగా తీర్చిదిద్దాలనే గోల్. వ్యాపారాన్ని, కుటుంబాన్ని సమన్వయం చేసుకున్న వాడే విజేత."

"వాహ్. ఎంత బాగా చెప్పావు? నువ్వు ఫైనాన్స్‌లో కంటే, గృహిణిగా ఎక్కువ రాణిస్తావేమో" స్నేహితురాలు నవ్వింది.

"నేను రెంటిలోనూ రాణిస్తా. చూస్తూండు. కాని నువ్వే చెప్పు. ఆయన్నే ఉదాహరణగా తీసుకుందాం. పగలంతా ఆఫీస్ పనులు, వ్యాపారవత్తిళ్ళు, మీటింగ్స్ చాలా బిజీగా ఉండచ్చు. కాని పక్షి గూటికి చేరినట్లు రాత్రి ఇంటికి చేరాలికదా? చేరాక ఏం చేస్తారు? బహుశా స్నానం, భోజనం, ఓ గంట పుస్తకాలు చదవడం.. తర్వాత? ఆయనకి అద్భుతమైన పడకగది ఉండచ్చు. హంసతూలికాతల్పం ఉండచ్చు. కానీ పక్కన ఒకళ్ళు ఉండాలి కదా? "

రెండో అమ్మాయి కిసుక్కున నవ్వింది.

"నేను సెక్స్ గురించి చెప్పడంలేదు. తోడు గురించి చెప్తున్నాను. పక్కన భార్య ఉందనుకో 'ఇవాళ ఏం జరిగిందో తెలుసా?' అని కబుర్లు చెప్పుకోవచ్చు. ఒక పాట విన్నప్పుడో, ఒక కథ చదివినప్పుడో అది పంచుకోవాలని, దాని గురించి చర్చించాలని ఉండదా? పోనీ ఒక సినిమా చూసినప్పుడు కానీ పక్కన ఒకళ్ళుండాలి కదా?"

"నువ్వు నీ మిడిల్ క్లాస్ మాటలు చెప్తున్నావు. అంత గొప్పాయన అమ్మలక్కల కబుర్లు చెప్తాడా?" స్నేహితురాలు అడ్డు తగిలింది.

"మేన్ ఈజ్ ఏ సోషల్ ఏనిమల్. మనిషి సంఘజీవి. మనసులో మాట చెప్పుకోడానికి ఎవరూ లేకపోతే, ఆ వెలితిని తెలిసో తెలియకో ఆయన అనుభవిస్తూనే ఉంటాడు. ఎపుడో ఏకాంతంలో తనకీ ఓ మనిషి ఉంటే బాగుండును అనిపిస్తుంది. కానీ ప్రయోజనం ఏముంది? వయసు అయిపోయింది. ఫిఫ్టీ ప్లస్‌కి చేరుకున్నాక పశ్చాత్తాపాలు తప్ప ఏమీ చేయలేడు. భార్య హృదయంలో తలదాచుకుని పడుకోడానికి, అతి మెత్తటి దిండుమీద పడుకోడానికి తేడాలేదు? యవ్వనంలో ఉన్నప్పుడు ఆయన ఎవర్నో ప్రేమించే ఉంటాడు. ఈ

గోల్స్, అఛీవ్‌మెంట్స్ అని ఆ ప్రేమని దూరం చేసుకున్నాడు అనుకుందాం. ఇప్పుడు ఎవరెస్ట్ చేరాక తర్వాత ఏంటి? ఏం సాధించాలి? ఆ కోల్పోయిన ప్రేమని సాధించమను చూద్దాం."

"ష్! ఆయన మన వెనకే నడుస్తున్నాడు. మనమాటలు వింటున్నాడేమో?" రెండో అమ్మాయి తగ్గు స్వరంతో చెప్పింది.

"అర్థంకాదులే. ఆయన ముంబైవాడు. తెలుగువాడైతే మన ప్రిన్సీ ఇంకా ఓవరాక్షన్ చేసేవాడు. తెలుగువారి వజ్రం, రత్నం అని." మొదటి అమ్మాయి కొట్టిపారేసింది.

"అంత గొప్పవాళ్ళు కూడా ఇంటికి వచ్చాక పెళ్ళాంతో కబుర్లు చెప్తారంటావా?" రెండో అమ్మాయి సందేహంగా అడిగింది.

"ఏం మీ అమ్మా నాన్నా మాట్లాడుకోరా?"

"మేమంటే మిడిల్ క్లాస్."

"మానవ సంబంధాలకి, అనుబంధాలకి ఈ క్లాస్‌ల గోల ఉండదని నా అభిప్రాయం. కష్టమో, సుఖమో భాగస్వామికి తప్పకుండా చెప్పుకుంటారనే నా ఉద్దేశం. తనకి ఇష్టమైలన్, తనని ప్రేమించే భాగస్వామికి."

"మనకి తెలియని బ్రహ్మ పదార్థం అది. మనం సూపర్ రిచ్ అయ్యాక తెలుసుకుందాం." రెండో అమ్మాయి నవ్వింది.

నిరంజన్ వేగంగా నడిచి తన కారు దగ్గరకి చేరుకున్నాడు.

"ఆలస్యమైంది. సరాసరి ఏర్‌పోర్ట్‌కి పోనీ" చెప్పాడు.

నిరంజన్ సహజంగా కాలం వృధా చేయడు. కారులో కూర్చున్నప్పుడు ఫైల్స్ చెక్ చేస్తాడు. రాత్రిపూటైతే రీడింగ్ లైట్‌ని ఫైల్‌కి అటాచ్ చేసి చదువుతాడు. కానీ ఆ రోజు ఎందుకో అతనికి అవేమీ చూడాలనిపించలేదు. వెనక్కి వాలి కళ్ళుమూసుకున్నాడు.

తనకంటే దాదాపు పాతిక, ముప్పైఏళ్ళ చిన్నపిల్ల తన జీవితం గురించి ఎంత బాగా విశ్లేషించింది? అవును తను ఎవరెస్ట్‌కి ఒకటి రెండడుగుల దూరంలోనే ఉన్నాడు. తర్వాత ఏంటి? ఇంకా ఏం సాధించాలి?

అతనికి నీలిమ గుర్తొచ్చింది. లాఘవంగా బొమ్మలు గీసే ఆమె సన్నటి చేతివేళ్ళు గుర్తొచ్చాయి. ఎర్రబారి, కన్నీళ్ళతో మలినమైె తనవంక నిస్సహాయంగా చూసే కళ్ళు గుర్తొచ్చాయి.

బాధగా తల విదిలించాడు.

"మీరు కొత్తగా వచ్చారా?"

తలవంచుకుని నడుస్తున్న పద్దెనిమిదేళ్ళ నిరంజన్ ఉలిక్కిపడి చూసాడు.

సన్నగా, పొడుగ్గా చురుగ్గా ఉన్న ఓ అమ్మాయి పక్కనే నడుస్తోంది. అతను తనవంక చూడగానే ఆత్మీయంగా నవ్వి చెప్పింది.

"మేం ఫస్ట్‌ఫ్లోర్‌లో ఉంటాం. ఫాదర్ అనుకుంటాను. మీకు తెలుగులో జాగ్రత్తలు చెప్తున్నారు కదా?"

"అవును. విజయవాడనించి ఇక్కడికి ట్రాన్స్‌ఫరై వచ్చాం. నాకు హిందీ రాదు. అందుకని నాన్న ఇంగ్లీష్‌లో మాట్లాడమని చెప్తున్నారు" చెప్పాడు.

"ఓ! నా పేరు నీలిమ. నేనిక్కడే పెరిగాను. మా తాతయ్య ఇక్కడ రైల్వేలో పనిచేయడానికివచ్చారు. మా నాన్నకూడా ఇక్కడే పుట్టి పెరిగారు. నీ పేరేంటి? ఏం చదువుతున్నావు?"

"నా పేరు నిరంజన్. బి.కామ్ ఫస్టియర్‌లో జాయినయ్యాను. నువ్వు?" కాలేజ్ పేరు చెప్పి అడిగాడు.

"నేను జెజె కాలేజ్ ఆఫ్ ఆర్ట్‌లో చదువుతున్నాను." నీలిమ చెప్పింది.

"అంటే బిఏనా?"

"కాదు. ఆర్ట్ అంటే కళ. అక్కడ శిల్పం, చిత్రలేఖనం ఇంటీరియర్ డెకొరేషన్‌లాంటివి నేర్పుతారు. వాటిలోనే డిగ్రీలు ఇస్తారు" వివరించింది.

"ఓ! నువ్వు ఎందులో చేరావు?"

"నాకు చిన్నప్పటినుంచి బొమ్మలు గీయడం అంటే ఇష్టం. చిత్రలేఖనంలో చేరాను. అక్కడ సీట్ రావడం కష్టం. యం.ఎఫ్ హుస్సేన్ లాంటి వాళ్ళు గెస్ట్ లెక్చర్స్ ఇస్తారు తెలుసా?"

"అయ్యబాబోయ్! నువ్వు గొప్ప తెలివైనదానివి" నిరంజన్ మెచ్చుకున్నాడు.

"సరే. నా బస్టాప్ వచ్చేసింది. నువ్వు కొంచెం ముందు కెళ్ళి జీబ్రా క్రాసింగ్ దగ్గర రోడ్ క్రాస్ చేసి, ఆ కనబడే బస్టాప్‌లో నుంచో. మీ కాలేజ్ వాళ్ళు చాలామంది ఉంటారు అక్కడ" అతను ఏ బస్ ఎక్కాలో వివరించింది.

విజయవాడ నించి బాంబే మహానగరానికి వచ్చిన నిరంజన్‌కి నీలిమతో స్నేహం కుదిరింది. ఆ అమ్మాయి మంచితనం, డేషింగ్ స్వభావం, చురుకుదనం చూసి ఆమెని ఓ అద్భుతంలా చూసేవాడు.

సమవయస్కులైనా నీలిమ వెనకే విధేయతగా ఉండేవాడు. నీలిమ అతనికి బాంబేని పరిచయంచేసింది. మొదట్లో బీచ్‌లు, గేట్ వే ఆఫ్ ఇండియాలాంటి ప్రసిద్ధి చెందిన స్థలాలకి తీసుకెళ్ళినా, ఆ తర్వాత అతనికి తెలియని ప్రపంచాన్ని చూపించింది. సన్న సన్న సందుల్లో పరిఢ విల్లే మరాఠీ సంస్కృతి, గుజరాతీయుల ఐకమత్యం, విభిన్నంగా కనిపించే పార్శీల జీవన విధానం సన్నటి వీధుల్లో శుభ్రమైన అరుగులమీద వ్యాపారం చేసే యూదులు. బొంబాయ్ అతని మనసుని దోచుకుంది. నీలిమకూడా.

ఎప్పుడూ నీలిమ వెనక ఒక బేక్ పేక్ ఉండేది. తనని ఆకర్షించిన దృశ్యం ఏదైనా కనిపించగానే చటుక్కున ఆగి, ఆ బేగ్‌లోంచి నోట్ బుక్, పెన్సిల్ తీసి, చకచకా ఆ దృశ్యాన్ని బొమ్మగీసేది. ఆ చేతివేళ్ళ నైపుణ్యానికి నిరంజన్ ఆశ్చర్యపోయేవాడు.

బికామ్ మూడో సంవత్సరంలో ఉండగా ఓ రోజు ఇద్దరూ సముద్రపు ఒడ్డున కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నప్పుడు నిరంజన్ వణికే కంఠంలో చెప్పాడు.

"నీలిమా! ఐ లవ్ యూ."

ఆమె ఓ క్షణం బిత్తరపోయి, తర్వాత నవ్వేసి చెప్పింది. "ఇంత ఆలస్యంగానా అడిగేది? లాస్టియరే చెప్తావనుకున్నాను." అతను చనువుగా ఆమె చేతిని పట్టుకుని చెప్పాడు.

"నాకు చాలా గోల్స్ ఉన్నాయి నీలూ. మనం వాటిని సాధించాలి. నేను బిజినెస్ చేస్తాను. దేశంలోని టాప్ ఫైవ్ బిజినెస్ మేగ్నెట్స్‌లో ఒకణ్ణి అవుతాను. నిన్ను నేలమీద నడిపించను తెలుసా?"

"అంటే నా కాళ్ళు విరగ్గొడతావా?" నీలిమ నవ్వేసింది.

"నేనైతే ఉద్యోగం చేయను. నిన్ను ఆఫీస్‌కి పంపేసి బొమ్మలు గీసుకుంటా. లేండ్ స్కేప్స్ అంటే ఎంత ఇష్టమో నాకు. ఏడాదికోసారి ఆ ఏడాది గీసిన బొమ్మలతో ఎగ్జిబిషన్ పెడతా. నువ్వు అప్పటికి రిచ్ అవుతావు కాబట్టి, నాకో ఆర్ట్ గేలరీ కొనివ్వాలి సరేనా?"

"సరే. సరే. ఈ మాటమీదే ఉండు. నేను జాబ్ కోసం ట్రై చేస్తున్నాను. నైట్ కాలేజ్‌లో యం.బిఏలో చేరతాను. పార్ట్ టైం బిజినెస్ చేస్తాను." ఆత్మ విశ్వాసంతో చెప్పాడు.

"ఒకే. ఒకే" నీలిమ తన మద్దతు తెలిపింది.

"నిరంజన్! రేపు నువ్వోసారి మా ఇంటికి రాగలవా?" తమ సంకేత స్థలంలో కలిసిన నీలిమ అడిగింది.

"మీ ఇంటికా? ఎందుకు?"

"మా నాన్నకి నిన్ను పరిచయం చేయాలి. నా డిగ్రీ అయిపోగానే వాళ్ళకి నా పెళ్ళి చింత పట్టుకుంది. ఫ్రీ బర్డ్‌లా తిరుగుతూంటాను కదా? ఏ జ్యానో, జూరాష్ట్రియన్నో ప్రేమిస్తానేమో అని వాళ్ళ భయం. నీ గురించి చెప్పాను. నాన్న నిన్ను రేపు తీసుకురమ్మన్నారు. కుదురుతుందిగా?"

"రేపు శనివారమేగా? తప్పకుండా కుదురుతుంది. సాయంత్రం ఆరుగంటలకల్లా వస్తాను. సరేనా?"

"సరే మర్చిపోకు. నువ్వు రాకపోతే నాకు చాలా అవమానంగా ఉంటుంది" హెచ్చరించింది.

మర్నాడు ఆఫీస్‌లో పని చేసుకుంటున్న అతనికి ఫోన్ వచ్చింది.

"మిస్టర్ నిరంజన్! నేను ఎకనమిక్ టైమ్స్ నించి మాట్లాడుతున్నాను. ఎడిటర్‌గారు ఈ రోజు సాయంత్రం ఐదుకి నిన్ను ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారు" ఓ కంఠం వినిపించింది.

నిరంజన్ ఆనందంతో పరవశించిపోయాడు. అందులో ఉద్యోగం కోసం అప్లై చేసి ఆరునెలలు దాటింది. ఇంతకాలానికి ఎడిటర్ స్వయంగా అపాయింట్ మెంట్ ఇచ్చారు.

ఆఫీస్ అవగానే సరాసరి టైమ్స్ బిల్డింగ్‌కి చేరుకున్నాడు. ఎడిటర్ అతన్ని కొన్ని ప్రశ్నలడిగి అతనికి అనలిస్ట్ హోదాతో ఉద్యోగం ఇచ్చాడు. అక్కడినించి బయటపడి, ఇల్లు చేరేసరికి ఎనిమిదైంది. కింద గేట్ దగ్గరున్న నీలిమని చూస్తేకాని అతనికి ఆ రోజు వాళ్ళింటికి వస్తానని చెప్పిన మాట గుర్తురాలేదు.

"సారీ నీలూ. ఎకనమిక్ టైమ్స్.." ఏదో చెప్పబోతూంటే ఆమె విసురుగా లోపలికి వెళ్ళిపోయింది. వెనకే వాళ్ళింటికి వెళ్ళి ఆలస్యానికి క్షమాపణ అడగాలని అనుకున్నా వెళ్ళలేదు. లిఫ్ట్‌లో తన ఇంటికి వెళ్ళిపోయాడు.

వారం తర్వాత నీలిమ కనిపించింది.

"నీలూ" పిలిచాడు.

"నువ్వేం చేసావో నీకు తెలుసా? ఎంత అవమానించావో అర్థమైందా? మా నాన్నకి నిన్ను ప్రేమించానని చెప్పాను. ఇంటికి రమ్మంటే వస్తానన్నావు. మరి రాకపోవడంలో అర్థమేంటి? అమ్మావాళ్ళు నన్నేం అనుకుంటారు? నీకు బుద్ధుందా?" కళ్ళ వెంట నీరు కారుతూండగా రోషంగా అడిగింది.

"ఆ రోజే నాకు ఇంటర్వ్యూ ఉంది. అప్పటికప్పుడు చెప్పారు. ఆఫీస్ నించి సరాసరి వెళ్ళిపోయాను. కావాలని చేయలేదు."

"సరే. వెంటనే వెళ్ళిపోయావు. కానీ కనీసం నాకు ఫోన్ చేసి చెప్పచ్చుగా? ఇవాళ కుదరదు మరో రోజు వస్తానని. పిచ్చిదానిలా ఎదురుచూసాను తెలుసా?"

"నాకు తట్టలేదు" అతనికి ఈ సంజాయిషీలు చెప్పడం విసుగ్గా ఉంది.

ఆమె చురుగ్గా చూసి వెళ్ళిపోయింది.

"నీలూ! మీ ఇంటికి ఎప్పుడు రమ్మంటావు?" ఆ సాయంత్రం అడిగాడు.

"ఇప్పుడిప్పుడే వద్దు. నాన్న కోపంగా ఉన్నారు. నేను చెప్తాను."

ఎందుకో నిరంజన్‌కి రిలీఫ్‌గా అనిపించింది.

"నీలూ! షేర్ మార్కెట్‌లో ఇప్పుడు నా షేర్స్ విలువ తెలుసా? పదిలక్షలు!" చెప్పాడు.

"పదిలక్షలా? అమ్మో!" ఆశ్చర్యపోయింది.

"చూస్తూండు. ఇంకొంచెం పెరగగానే బిజినెస్ స్టార్ట్ చేస్తాను" ఆత్మ విశ్వాసంతో చెప్పాడు.

నీలిమ పెళ్ళిని తప్పించుకోడానికి పిజిలో చేరింది.

"నీరూ! నా పెళ్ళి ఫిక్స్ చేసారు. ప్లీజ్! మనం ఎక్కడికైనా వెళ్ళిపోయి పెళ్ళిచేసుకుందాం" నీలిమ కన్నీళ్ళతో వేడుకుంది.

"నీలూ! నాకు ఆదిత్య బిర్లాతో అపాయింట్‌మెంట్ దొరికింది. అదీ అతి కష్టం మీద. ఆయన నా ఐడియాలు మెచ్చుకుని, సాయంచేస్తే బిజినెస్‌లో మనం ఇంకాస్త పైకి పోవచ్చు. ఈ శుభవార్త చెప్దామని వస్తే ఆ ఏడ్పు ఏమిటి? ఐనా ఇంత చిన్న వయసులో పెళ్ళేంటి? జీవితంలో ఎన్నో సాధించాలి" చిరాగ్గా చెప్పాడు.

"ప్రేమకి చిన్న వయసు కాదు కానీ, పెళ్ళికి చిన్నవయసా? నీ గ్రోత్‌కి నేను అడ్డుపడను నీరూ. ప్లీజ్. మనం రిజిస్టర్ మేరేజ్ చేసుకుందాం. ఆ ముక్కూ మొహం తెలీని అబ్బాయిని నేను చేసుకోలేను" నీలిమ చేతులు జోడించింది.

"ఆర్గ్యుమెంట్స్ వద్దు ప్లీజ్. మీవాళ్ళకి ఏదో నచ్చచెప్పు. ఒక్క ఏడాది ఆగు చాలు. ఈలోగా మనకోసం ఇంద్రభవనంలాంటి ఇల్లు కొంటాను చూస్తూండు. అప్పుడు మీ నాన్నే వచ్చి నన్ను అడుగుతాడు. 'మా అమ్మాయిని చేసుకో' అని. ఇప్పుడు పెళ్ళంటే, పోలీస్ కేస్ అయితే నాకు అది దెబ్బ"

నీలిమ నిస్సహాయంగా చూసి వెళ్ళిపోయింది.

పదిరోజుల్లో నీలిమ పెళ్ళి వేరొకరితో జరిగింది. అందుకు నిరంజన్ చాలా బాధపడ్డాడు కాని, ఆమెని పెళ్ళిచేసుకునే ధైర్యం చేయలేకపోయాడు.

కారు రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఏర్‌పోర్ట్‌లో డొమెస్టిక్ డిపార్చర్స్ దగ్గర ఆగింది.

నిరంజన్ లోపలికి నడిచాడు. అతను బాంబేలోని తన ఇంటికి చేరేసరికి తెల్లారుఝామైంది. అలసటగా బెడ్రూంలోకి వెళ్ళాడు. ఆ అమ్మా యి చెప్పినట్లు అందమైన గది, హంసతూలికా తల్పం. ఆ ఏకాంతంలో ఏభై రెండేళ్ళ నిరంజన్‌కి ఎందుకో ఈ ప్రపంచంలో తను వంటరి అనేభావన కలిగింది. నీలిమ ఉంటే, ఆ అమ్మాయి చెప్పినట్లు తను 'ఇవాళేం జరిగిందో తెలుసా?' అని కబుర్లు చెప్పేవాడా? దిండు మీద కాక ఆమె గుండెల మీద నిద్రపోయేవాడా?

నిరంజన్‌కి పగలంతా ఎప్పటిలా బిజీగా గడిచింది. అనేక మీటింగ్స్, వ్యాపార వత్తిళ్ళు, భవిష్యత్ ప్రణాళికలు.. ఇంటికి చేరేసరికి రాత్రి తొమ్మిదైంది. స్నానం అయినాక కుక్ వినయంగా చపాతీలు వడ్డించాడు. ఫోన్‌లో మెసేజెస్ చూసుకుంటూ వాటిని తిన్నాడు. తర్వాత పదిగంటల దాకా బయట తోటలో నడిచాడు. ఆ వాకింగ్‌లోనే అతనికి వ్యాపారవృద్ధికి కొత్త ఆలోచనలు వస్తూంటాయి. తర్వాత ఓ అరగంట పుస్తకాలు తిరగేసాడు. తర్వాత బెడ్రూం వైపు నడిచాడు. వెంటనే అతనికి ఆ యం.బి.ఏ అమ్మాయి మాటలు గుర్తొచ్చాయి. నిరంజన్‌ని ఎందుకో వంటరితనం ఆవరించుకుంది. కళ్ళు మూసుకున్నాడు. ఆలోచనల్లో నీలిమ. అలవోకగా అందమైన చిత్రాలు చిత్రించే నీలిమ.

ఇరవై ఏళ్ళ క్రితం అతనికి నీలిమ అనుకోకుండా కనిపించింది. బిజినెస్ మీటింగ్ కోసం లండన్ వెళ్తున్నప్పుడు ఏర్‌పోర్ట్‌లో. తనే గుర్తుపట్టి పిలిచింది.

"నీరూ.. నిరంజన్."

నీలిమని చూసిన నిరంజన్ ఏదో పెన్నిధి దొరికినట్లుగా ఆనందంగా చెప్పాడు.

"నీలూ.. నువ్విక్కడ.. హేపీ."

ఆమె చేతిని పట్టుకుని ఆప్యాయంగా నిమిరాడు.

"నేనిప్పుడు అమెరికాలో ఉంటున్నాను నీరూ. నాన్నకి బాలేదని చూడడానికి వచ్చాను.. పోయారు. వెనక్కి వెళ్ళిపోతున్నాను" చెప్పింది.

"అరె పాపం! రా లాంజ్‌లో కూర్చుందాం" చెయ్యిపట్టుకునే చెప్పాడు.

"నాది ఎకానమీ టిక్కెట్ నీరు. ఇక్కడ మాట్లాడుకుందాం" చెప్పింది.

"ఫర్వాలేదు. రా"

ఆమెని తనతో తీసుకెళ్ళాడు. కాఫీ కప్పులతో వచ్చి అడిగాడు.

"ఇప్పుడు చెప్పు నీలూ ఏమిటి సంగతులు. నువ్వింకా అందంగా ఉన్నావు తెలుసా? అప్పటికన్నా బాగున్నావు" ప్రేమగా చెప్పాడు.

"నిరంజన్! నువ్వు నీ గోల్‌కి రీచ్ అయినట్లున్నావే? సూట్‌లో బాగున్నావ్" నీలిమ నవ్వుతూ చెప్పింది.

"ఆల్మోస్ట్. ఇప్పుడు కూడా లండన్‌లో బిజినెస్ పనిమీదే వెళ్తున్నాను.." ఓ నిమిషం ఆగి అడిగాడు.

"నీ హస్బెండ్ నిన్ను బాగానే చూసుకుంటాడా?"

"ఆఁ పర్లేదు." నీలిమ తలవంచుకుని చెప్పింది.

"పర్లేదా? అదేంటి? నీలాంటి బంగారు తల్లి ఎవరికి దొరుకుతుంది? వాడు పూర్వజన్మలో చేసిన పుణ్యం వల్ల నీ భర్తయ్యాడు. నిన్ను పువ్వుల్లో పెట్టి పూజించుకోవాలి తెలుసా?" ఆమె అరచేతిని ముద్దుపెట్టుకుంటూ చెప్పాడు. అతని కళ్ళల్లో సన్నటి నీటిపొర.

"అలా చూడడానికి అతను నిరంజన్ కాదుగా? రామారావు" నవ్వింది ఆమె కళ్ళల్లో బాధని స్పష్టంగా గుర్తించాడు.

"పిల్లలా?" అడిగాడు.

"ఒక్కడే బాబు. పేరు నిర్మల్"

నిరంజన్‌కి చిన్నప్పటి తమ కలలు గుర్తొచ్చాయి. 'నీ పేరు నిరంజన్ నా పేరు నీలిమ. మనకి పుట్టబోయే కొడుక్కి నిర్మల్ అని పేరు పెట్టుకుందాం.'

"కూతురైతే నిర్మలా?"

"కాదు. కూతురు పుట్టదు. నీలాంటి బుల్లి నిరంజన్ పుడతాడు" అతను దీర్ఘంగా నిట్టూర్చి అడిగాడు.

"రామారావు, నీలిమ కొడుకు నిర్మల్ ఏమిటి?"

"రామారావుకి ఏదైనా ఒకటే. అంత అభిరుచేం లేదు. నేనే పెట్టాను."

"సరే. ఎన్ని బొమ్మలు గీసావు నీలూ? నీ లేండ్ స్కేప్స్ చూసి అమెరికన్స్ ఏమంటున్నారు?"

"నేను బొమ్మలు గీయడంలేదు నిరంజన్. గ్రాఫిక్ డిజైనర్‌గా పనిచేస్తున్నాను. రామారావు ఒక్కరి సంపాదనతో పిల్లాడితో బతకడం కష్టం. నిజానికి పెళ్ళయి, నేను అక్కడికి వెళ్ళేలోపలే అతను ఉద్యోగం చూసి ఉంచాడు."

"అంటే నువ్వు కలగన్నట్లు లేండ్స్కేప్స్ గీస్తూ ఇల్లాలుగా ఉండిపోలేదా?" నిరంజన్ ఆవేశంగా అడిగాడు.

"చాలా కలలు కన్నాను. ఏవీ నెరవేరలేదు."

"నీకు ఎంత జీతం వస్తుందో చెప్పు. ప్రతీనెల ఆ అమౌంట్ మా బ్రాంచ్ నించి నీ అకౌంట్‌లో పడుతుంది. జాబ్ మానేసి, నువ్వు కోరినట్లుగా లేండ్ స్కేప్స్ గీస్తూ, ఏడాదికోసారి ఒన్‌మేన్ షోలో ప్రదర్శిస్తూ..."

"ఆగాగు. నెలనెలా ఉదారంగా ఇంత డబ్బిస్తున్న ఈ నిరంజన్ ఎవరు? అని రామారావు అడిగితే ఏం చెప్పాలి?" కొంటెగా అడిగింది.

"మీ పక్కింటబ్బాయ్ అని చెప్పు."

"నేను అబద్దమాడలేను నీరు. నా ప్రియుడనే చెప్పాలి. నేను ఈ నిమిషందాకా ప్రేమిస్తోంది నిన్నే. రామారావుతో కలిసి జీవిస్తున్నా అంతే. " వెళ్ళిపోయింది. గుమ్మందాటేప్పుడు ఆమె చెంపలమీద కారే కన్నీటిని నిరంజన్ స్పష్టంగా చూసాడు.

"సర్!" సెక్రటరీ వినయంగా పిలిచాడు.

"యస్?" నిరంజన్ ప్రశ్నార్థకంగా చూసాడు.

"గౌరవ్ అనే ఓ కుర్రాడు మీ అపాయింట్‌మెంట్ కావాలని నెలరోజులనించి తిరుగుతున్నాడు. మీరు వెళ్ళిన హైద్రాబాద్ ఐ ఎస్ బిలోనే చదువుకున్నాడుట. మీ స్పీచ్ విని, మీతో కనీసం ఐదు నిమిషాలైనా మాట్లాడి, తన బిజినెస్ ఐడియాలు చెప్పాలని కోరికట. మీరు బిజీ అని చెప్పినా వినడం లేదు."

ఆ సాయంత్రం తన ఎదురుగా కూర్చున్న గౌరవ్‌ని చూస్తే, ముప్పై ఏళ్ళనాటి నిరంజన్ గుర్తొచ్చాడు. అదే ఉత్సాహం.. కళ్ళల్లో అవే కలలు.

"నీకు తప్పకుండా సాయం చేస్తాను. కాకపోతే ఓ పర్సనల్ ప్రశ్నకి సమాధానం కావాలి. నువ్వు ఏమీ అనుకోకపోతేనే" చెప్పాడు.

"అడగండి సార్" అతను ఆనందంగా చెప్పాడు.

"నీకు గర్ల్‌ఫ్రెండ్ ఉందా?"

గౌరవ్ ఓ క్షణం తటపటాయించాడు.

"దానికి నీ స్టార్టప్‌కి సంబంధంలేదు. చెప్పు."

"ఉంది. శ్రియ. మా అమ్మదగ్గర సంగీతం నేర్చుకోడానికి వస్తుంది. నేను బాగా సెటిలయ్యాక తననే పెళ్ళి చేసుకుంటాను" ఆ మాటల్లో ఆమె మీద అతనికి గల ప్రేమ కనిపించింది.

నిరంజన్ ఒక్క నిమిషం ఆలోచించి చెప్పాడు.

"చూడు గౌరవ్. 'బాగా సెటిల్ అవడం' అనేదానికి నిర్వచనాలు మారుతుంటాయి. చిన్నకారు కొనాలనుకున్నవాడు కొన్నాక పెద్ద కారైతే బావుంటుంది అని ఆలోచిస్తాడు. అదేవిధంగా బిజినెస్‌లో మొదటి లక్ష, మొదటికోటి... ఇలా తృప్తి ఉండదు. అదే సమయంలో ఆడపిల్ల తల్లితండ్రులు అంతకాలం వేచి వుండరు. వాళ్ళ భయాలు వాళ్ళకి ఉంటాయి. పెళ్ళి నీ ప్రగతికి అడ్డుకాదు. నీ వ్యక్తిగత విషయాల్లో తలదూరుస్తున్నాననుకోకపోతే నువ్వు నిజంగా ఆ అమ్మాయిని ప్రేమిస్తూంటే, ఆమెని సాధ్యమైనంత త్వరగా పెళ్ళి చేసుకో. తర్వాత నా దగ్గరకి రా. నీకు కావాల్సిన సహాయం చేస్తాను. నీ భార్యకి ఏ అభిరుచి ఉంటే, ఆమెని అందులో కొనసాగనివ్వు. నేను చెప్పేది ఇప్పుడు నీకు విచిత్రంగా కనిపించినా, ముప్పై ఏళ్ళ తర్వాత నువ్వు తప్పకుండా నన్ను తలచుకుంటావు ఎప్పుడో ఏకాంతంలో" నిరంజన్ నవ్వాడు.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments